క్లుప్తంగా

నేటి నుంచి తరావీ ప్రార్థనలు

గోల్కొండ: నేటి నుంచి మసీదులు, కమ్యూనిటీహాళ్లలో తరావీ ప్రార్థనలు ప్రారంభం కానున్నాయి. బుధవారం రంజాన్ మాసపు నెల వంక దర్శనమిస్తే బుధవారం రాత్రి నుంచే తరావీ ప్రార్థనలు ప్రారంభమవుతాయి. దీని కోసం మసీదులు, కమ్యూనిటీహాళ్లు, షాదీఖానాలు సిద్ధమయ్యాయి. టోలిచౌకి, గోల్కొండ, అహ్మద్‌నగర్, మెహిదీపట్నం ప్రాంతాల్లోని జామా మసీదుల్లో నెలరోజుల పాటు తరావీ ప్రార్థనలు ఉంటాయి.

నేడు రాష్ట్రపతి నిలయానికి ప్రత్యేక బస్సులు

సంతోష్‌నగర్: ఉగాది నూతన సంవత్సరం పర్వదినాన్ని పురస్కరించుకొని నేడు రాష్ట్రపతి నిలయానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు హైదరాబాద్ రీజనల్ మేనేజర్ బి.వరప్రసాద్ తెలిపారు. సందర్శకుల కోసం పండుగ రోజు సైతం రాష్ట్రపతి నిలయం తెరిచి ఉంటున్న నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

నేడు మ్యూజియానికి సెలవు

శాలిబండ: ఉగాది నూతన సంవత్సరం పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 22న సాలార్‌జంగ్ మ్యూజియానికి సెలవు ఉంటుందని మ్యూజియం అధికారులు తెలిపారు. ఈ విషయాన్ని సందర్శకులు గమనించాలన్నారు. గురువారం నుంచి యథావిధిగా తెరిచి ఉంటుందన్నారు.

అంతర్జాతీయ లెజెండరీ అవార్డుల ప్రదానం



నాంపల్లి: వివిధ రంగాల్లో నిష్ణాతులైన పలువురికి అంతర్జాతీయ లెజెండరీ అవార్డులు–2023 ప్రదానం చేశారు. ఎస్‌ఎస్‌ఐ గ్లోబల్ కౌన్సిల్, హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వీటిని అందజేశారు. హోం మంత్రి మహ్మద్ మహమూద్ అలీ వారికి అవార్డులు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో మాజీ డీజీపీ ఎస్.ఎ.హుదా, నిర్వాహకులు డాక్టర్ నవాబ్ షేక్ ఇబ్రహీం, కబీర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మసీదులకు కొత్త శోభ

గోల్కొండ: రంజాన్ మాసం సందర్భంగా మసీదులు కొత్త శోభను సంతరించుకున్నాయి. ప్రధాన మసీదులు, జామా మసీదులకు రంగులు వేసి విద్యుత్ దీపాలు అమర్చారు. ప్రార్థనలకు వచ్చేవారి కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. టోలిచౌకిలోని బిలాల్ మసీదు, గోల్కొండ కోటలోని ప్రాచీన కుతుబ్‌షాహీ జామా మసీదు, మెహిదీపట్నం చౌరస్తా జామా మసీదు తదితర మసీదులను సుందరంగా అలంకరించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఐదుగురికి జైలు

నాంపల్లి: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఐదుగురు వ్యక్తులకు జైలు శిక్ష విధిస్తూ నాంపల్లి కోర్టు తీర్పు వెల్లడించింది. నాంపల్లి ట్రాఫిక్ పోలీసులు ఇటీవల నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 14 మంది పట్టుబడగా ఐదుగురికి జైలు శిక్ష పడింది.



మెహిదీపట్నంలోని శ్రీచైతన్య స్కూల్‌లో ఉపాధ్యాయులకు ఉగాది పచ్చడి అందజేస్తున్న విద్యార్థులు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్

గోల్కొండ: రంజాన్ మాసంలో అధికారులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ సూచించారు. మంగళవారం ఆయన బల్దియా సెంట్రల్ జోన్ జోనల్ కమిషనర్ రవికిరణ్‌తో కలిసి కార్వాన్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసాన్ని ముస్లింలు ఎంతో పవిత్రంగా భావిస్తారన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా పిల్లలు, పెద్దలు ప్రతినిత్యం నమాజ్ కోసం మసీదులకు వస్తుంటారని



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

ఆయన చెప్పారు. తరావీ ప్రార్థనలు, ఉపవాస దీక్షలను విరమించేందుకు మసీదులు, కమ్యూనిటీ హాళ్లకు వస్తుంటారని, మసీదుల పరిసర ప్రాంతాలను, రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. శానిటేషన్‌పై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి పక్కాగా అమలు చేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తరలించాలన్నారు. సిబ్బంది వార్డు కార్యాలయంలో ఉండాలని, క్షేత్ర స్థాయి సిబ్బంది ఎప్పటికప్పుడు తమ ప్రాంతాల్లో పర్యటిస్తుండాలని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో అధికారులతో పాటు మజ్లిస్ నాయకులు హారూన్ ఫరాన్, వజీ ఉజ్‌జమా, బదర్ ఉద్దీన్ హారూన్ ఫరాన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ముందుంటాం

దబీర్‌పురా: ప్రజా సమస్యల పరిష్కారంలో మజ్లిస్ పార్టీ ముందంజలో ఉంటుందని మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అన్నారు. మంగళవారం డబీర్‌పురా డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో రూ.1.50 కోట్ల నిధులతో చేపట్టిన నూతన సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా డివిజన్‌లో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్.ఎం.అబ్రార్, సయ్యద్ అలీం, నరేందర్, అహ్మద్ పాషా, మహ్మద్ యూనుస్, మహమూద్, కరీం తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలాల

ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెరుగుతోంది



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సునీత

గోల్కొండ: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగుల సంఖ్యను మరింత పెంచాలని తెలంగాణ వైద్యవిధాన పరిషత్ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ సునీత అన్నారు. మంగళవారం గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో వైద్యులు, నర్సింగ్ సిబ్బందితో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు, వైరల్ ఫీవర్‌పై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు ఇప్పుడిప్పుడే నమ్మకం పెరుగుతుందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పెరుగుతున్న కాన్పుల సంఖ్య దీనికి నిదర్శనమని ఆమె అన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా, ఆర్‌ఎంఓ డాక్టర్ ఖాజా రవూఫ్ ఉద్దీన్, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మోదీ పాలనలో బలమైన శక్తిగా భారత్

గోల్కొండ: క్రమశిక్షణ గల కార్యకర్తలు, నాయకులే పార్టీకి అవసరం బీజేపీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ టి.అమర్‌సింగ్ అన్నారు. మంగళవారం బీజేపీ కార్వాన్ అసెంబ్లీ బూత్ స్వశక్తి కరణ్ అభియాన్‌పై సమావేశం నిర్వహించారు. కార్వాన్ దర్బార్ మైసమ్మ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ పాలనలో దేశం అంతర్జాతీయ స్థాయిలో బలమైన శక్తిగా ఎదిగిందన్నారు. పారిశ్రామిక, ఆర్థిక రంగంలో అగ్రదేశాల సరసన మన దేశం నిలిచిందన్నారు. భారత దేశ కీర్తిప్రతిష్ఠతలు ప్రధాని మోదీ హయాంలో ప్రపంచ వ్యాప్తమయ్యాయని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ప్రకాశ్‌రెడ్డి, గుడిమల్కాపూర్ పార్టీ అధ్యక్షుడు జి.సునీల్‌యాదవ్, దేవర శ్రీనివాస్, దేవర వంశీ, అశ్విన్, శ్రీకాంత్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ



కార్మికులతో మాట్లాడుతున్న నాగేశ్వర్

అఫ్జల్‌గంజ్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల వల్ల నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని సీఐటీయూ హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి పి.నాగేశ్వర్ అన్నారు. మంగళవారం కిషన్‌గంజ్‌లో హమాలీ కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏప్రిల్ 5న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమానికి కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

పాడి రంగానికి బ్యాంకులు ప్రోత్సాహం అందించాలి

మంత్రి నిరంజన్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: బ్యాంకింగ్ రంగంలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన పలు స్కీంలకు సంబంధించిన టార్గెట్‌లను విధిగా పూర్తి చేయాలని జాతీయ మైనారిటీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షెహజాదీ పేర్కొన్నారు. ఆమె మంగళవారం నగరంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యాలయంలో 2022–23 ఆర్థిక సంవత్సరపు రాష్ట్ర మైనారిటీ విభాగాల అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ అమిత్ జింగ్రాన్ 2022–23 ఆర్థిక సంవత్సర త్రైమాసిక ఫలితాలను, విధివిధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పాల కొరత ఉందని, రాష్ట్ర ప్రజలకు సరిపడా పాలు అందించలేకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రంలో



పాల ఉత్పత్తి రంగానికి ప్రోత్సాహం అందించేలా బ్యాంకులు సహకారం అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామక్రిష్ణారావు, కార్యదర్శి రొనాల్డ్ రాస్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, జనరల్ మేనేజర్ దెబాషిస్ మిత్రా, నాబార్డ్ జనరల్ మేనేజర్ డా.హరగోపాల్, ఆర్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

'చంద్రమౌళిని వెంటనే విడుదల చేయాలి'

సుల్తాన్‌బజార్: పీడీఎం అధ్యక్షుడు చంద్రమౌళిని వెంటనే విడుదల చేయాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మంగళవారం హైదర్‌గూడలో ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన వెంకటాపురం పోలీసులు ఈ నెల 20న హైదరాబాద్‌లోని దమ్మాయిగూడ బాలాజీగూడలో నివాసం ఉంటున్న గనాపురం చంద్రమౌళి (53)ని అరెస్టు చేశారన్నారు. చంద్రమౌళి ప్రజాతంత్ర దేశ భక్త ఉద్యమానికి అధ్యక్షుడిగా ఉంటూ 20 సంవత్సరాలుగా నాయకత్వం వహిస్తున్నారన్నారు.

దాసోజు శ్రావణ్‌కు సన్మానం



గౌలిపురా: తెలంగాణ భవన్‌లో మంగళవారం జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా నియమితులైన దాసోజు శ్రావణ్‌ను బీఆర్‌ఎస్ నాయకులు సన్మానించారు. మొఘల్‌పురా డివిజన్ అధ్యక్షుడు పుప్పాల రాధాకృష్ణ, పార్టీ నాయకులు మణికొండ విజయ్‌కుమార్, అనిల్‌కుమార్, ఇస్మాయిల్ ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

టోలిచౌకి ఆలయంలో భక్తి గీతాలు

గోల్కొండ: టోలిచౌకి చౌరాస్తాలో ప్రాచీన ఆలయంలో భక్తిగీతాల ఆలాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు భక్తి గీతాలు పాడారు. ప్రతివారం ఆలయ ప్రాంగణంలో భక్తిగీతాల ఆలాపన నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ ప్రతినిధులు వెంకటేష్, బాలకిషన్ తెలిపారు.

కేలండర్ ఆవిష్కరణ



అబిడ్స్: తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ అబిడ్స్ డివిజన్‌కు ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. డివిజన్ అధ్యక్షుడిగా సయిద్‌ఖాన్, కార్యదర్శిగా బషీరుద్దీన్ ఖాద్రీ, అసోసియేట్ అధ్యక్షుడిగా టి.రంగస్వామి, కోశాధికారిగా రవిప్రసాద్, ఉపాధ్యక్షుడిగా సునీల్‌కుమార్, సీహెచ్ శ్రీధర్‌రావు, బి.బెనర్జీ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.సరళాదేవి, జాయింట్ సెక్రటరీగా మహ్మద్ సంధానిఖాన్, కె.నర్సింహారెడ్డి, మహ్మద్ మాజీద్ హుస్సేని తదితరులు ఎన్నికయ్యారు.

లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

గౌలిపురా: ఆర్యవైశ్య సంఘం లాల్‌దర్వాజా గౌలిపురా ప్రతినెలా నిర్వహించే అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం గౌలిపురా బతుకమ్మ బావి వద్ద ఉన్న లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో విశేష పూజలు, రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఛత్రినాక పాత పోలీస్‌స్టేషన్ వద్ద అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శ్రీరాం కోటయ్య గుప్తా, సలహాదారులు చీల రాములు గుప్తా, సరాబు విశ్వేశ్వరయ్య గుప్తా, ప్రధాన కార్యదర్శి సరాబు సంతోష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న సంఘం ప్రతినిధులు

ప్రమోద్‌కుమార్ సేవలు అభినందనీయం

అఫ్జల్‌గంజ్: క్షయ వ్యాధి నివారణకు కృషి చేస్తున్న డాక్టర్ టి.ప్రమోద్‌కుమార్ సేవలు అభినందనీయమని తెలంగాణ మేధావుల ఫోరం చైర్మన్ డాక్టర్ రాజీనారాయణ్ ముదిరాజ్, కార్యదర్శి ప్రొఫెసర్ మహమ్మద్ అక్తర్ అలీ అన్నారు. మంగళవారం అఫ్జల్‌గంజ్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. క్షయ వ్యాధి నివారణకు గత 25 సంవత్సరాలుగా ప్రమోద్‌కుమార్ కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 24న ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయనను సన్మానిస్తున్నట్లు తెలిపారు.

'డాక్టర్ కల్పనపై దర్యాప్తు వేగవంతం చేయాలి'

అబిడ్స్: హైదరాబాద్ జిల్లా క్షయ వ్యాధి అధికారిణి కల్పనపై దర్యాప్తు వేగవంతం చేసి వెంటనే చర్యలు చేపట్టాలని టీఎన్‌జీఓస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌ఎం ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడాల శ్రీనివాస్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ.. ఉద్యోగులను వేధిస్తున్న డాక్టర్ కల్పనపై రెండు నెలలక్రితం తాము ఫిర్యాదు చేసినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదన్నారు. విచారణ జరిపి ఆమె శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

దాడి కేసులో ముగ్గురికి ఏడాది జైలు శిక్ష

దూద్‌బౌలి: పాత కక్షలను మనుసులో పెట్టుకొని ఓ కుటుంబంలోని వ్యక్తులపై దాడి చేసిన ముగ్గురికి ఏడాది జైలు శిక్ష విధించినట్లు హుస్సేనీఆలం ఇన్‌స్పెక్టర్ నరేశ్‌కుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. 2021 ఏప్రిల్‌లో హుస్సేనీఆలం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫతేదర్వాజా ప్రాంతానికి చెందిన ఖాజా పాషా, మహ్మద్ రియాజ్, మహ్మద్ అనాస్ పాత కక్షలను మనుసులో పెట్టుకొని హుస్సేనీఆలం ప్రాంతానికి చెందిన కె.ఎం.హిదెర్ ఇంటికి వెళ్లి అతడి కుమారులపై క్రికెట్ బ్యాట్‌తో దాడి చేసి గాయపరిచారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని వారిని అరెస్ట్ చేశారు. ఎస్ఐ నర్సింగ్‌రావు దర్యాప్తు చేపట్టి సాక్ష్యాధారాలను కోర్టుకు అందించగా మెజిస్ట్రేట్ దుర్గాప్రసాద్ ముగ్గురు నిందితులకు శిక్ష విధించినట్లు తెలిపారు.

గృహిణి ఆత్మహత్య

చాంద్రాయణగుట్ట: గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఆంజనేయులు తెలిపిన వివరాల మేరకు.. నాంపల్లి ఆగాపురానికి చెందిన ఫర్హానా బేగం(26) వివాహం 16 నెలల క్రితం చాంద్రాయణగుట్ట పూల్‌బాగ్‌కు చెందిన సయ్యద్ అల్తాఫ్‌తో జరిగింది. ప్రసవం కోసం పుట్టింటికి వెళ్లిన ఫర్హానా బేగం ఈ నెల 20వ తేదీన తన రెండు నెలల కుమారుడితో కలిసి అత్తారింటికి వచ్చింది. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కట్నం, గృహోపకరణ సామగ్రి తక్కువ తెచ్చావంటూ తరచూ ఇంట్లో గొడవలు జరిగేవని, వేధింపులు భరించలేకే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని ఫర్హానా బేగం కుటుంబ సభ్యులు చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

యాకుత్‌పురా: ప్రభుత్వం అమలు చేస్తున్న ఆసరా పెన్షన్ పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ సూచించారు. పలువురు లబ్ధిదారులకు మంజూరైన పెన్షన్ కార్డులను మంగళవారం ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. షాదీముబారక్, కల్యాణలక్ష్మి, ఆసరా పథకాలను అర్హులకు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మహ్మద్ వసీవుద్దీన్, డాక్టర్ సమీనాబేగం, అలాందార్ వాలాజాహి, నస్రీన్ సుల్తానా, ముజఫర్ హుస్సేన్, సయ్యద్ సోహెల్ ఖాద్రీ, చార్మినార్ మండల తహసీల్దార్ ఎస్‌పీఆర్ మల్లేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పెన్షన్ కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే పాషా ఖాద్రీ

విద్యార్థులకు మానవీయ విలువలు నేర్పించాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఆర్చ్ బిషప్ ఆంథోని

గన్‌ఫౌండ్రీ: విద్యార్థులకు విద్యతో పాటు మానవీయ విలువలు నేర్పించాలని పలువురు వక్తలు అన్నారు. మంగళవారం కింగ్‌కోఠిలోని భారతీయ విద్యాభవన్‌లో సెయింట్ జోసెఫ్ డిగ్రీ, పీజీ కళాశాల సిల్వర్‌జూబ్లీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ వెంకటరమణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. నాణ్యమైన విద్యా ప్రమాణాలు కలిగిన ఉన్న విద్యా సంస్థలకు ఎల్లప్పుడూ తమ ప్రోత్సాహం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కళాశాల సావనీర్‌ను ఆవిష్కరించి పలువురు ప్రముఖులను సన్మానించారు. కార్యక్రమంలో పాలమూరు విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొ. లక్ష్మీకాంత్ రాథోడ్, ఆర్చ్ బిషప్ పూల ఆంథోని, విశ్రాంత డీజీపీ ఎంవీ కృష్ణారావు, జేఎన్‌టీయూహెచ్ వైస్ చాన్సలర్ ప్రొ. కట్టా నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మసీదు ప్రారంభోత్సవం

శాలిబండ: మసీదు చాలా పవిత్రమైన స్థలమని, ఇక్కడ ఏకేశ్వరోపాసన దేవుడు ఒక్కడేనని ముఫ్తీ మహబూబ్ షరీఫ్ నిజామి అన్నారు. మంగళవారం మసీదు ఆయేషా ప్రారంభోత్సవంలో ఆయనతో పాటు ఆధ్యాత్మిక గురువులు, విద్యావేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మసీదులు ప్రార్థనలు చేయడానికి, జ్ఞానాన్ని పంచడానికి ఉపయోగపడతాయన్నారు. మనుషులంతా తనను సృష్టించిన దైవానికి జవాబుదారీగా ఉండి ఇతరులకు సేవ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సద్దాం, డాక్టర్ ఫజిలుల్లా షరీఫ్, న్యాయవాది డాక్టర్ ఇక్బాల్ రషీద్, డాక్టర్ మహ్మద్ ఎజాజ్, డాక్టర్ సిబాగత్ ఉల్లా షరీఫ్, రషీద్ ఖాన్, ఖాలేద్ ఖాన్, డాక్టర్ మఖ్బూల్ ఖాన్ పాల్గొన్నారు.



మసీదు ప్రారంభోత్సవంలో ఆధ్యాత్మిక గురువులు

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాడతాం



యాకుత్‌పురా: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ యూనియన్ నిరంతరం పోరాడుతుందని తెలంగాణ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు కొమ్ముగళ్ల బాలకృష్ణ అన్నారు. బీజేపీ మజ్దూరు మోర్చా సౌత్‌జోన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎం.మహేందర్ ఆధ్వర్యంలో పలువురు సంఘం నాయకులు మంగళవారం యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎల్లమయ్య, రవీందర్, కృష్ణ, సౌత్‌జోన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, సునీల్‌కుమార్, రాజు పాల్గొన్నారు.

రంజాన్ మాస ఉపవాస దీక్షలు పవిత్రమైనవి

గోల్కొండ: మానవాళికి రంజాన్ మాసం అల్లాహ్ ఇచ్చిన వరమని ఆల్ ఇండియా ఖీరత్ కమిటీ అధ్యక్షుడు ఖారీ సయ్యద్ మతీన్ అలీషాఖాద్రి అన్నారు. మంగళవారం గోల్కొండలోని ఖర్వా మసీదులో జరిగిన రంజాన్ ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రంజాన్ మాస ఉపవాస దీక్షలు ఎంతో పవిత్రమైనవని ఆయన అన్నారు. ఈ ఉపవాస దీక్షలు పాటించేవారు దైవకృపకు పాత్రులవుతారన్నారు. రంజాన్ మాసపు నెలవంక కనిపించగానే తరావీ ప్రార్థనలు నెల మొత్తం చేయాల్సి ఉంటుందన్నారు. తరావీ ప్రార్థనల్లో ఇమామ్ ప్రార్థనలకు సారథ్యం వహిస్తూ దివ్యఖురాన్ గ్రంథాన్ని పటిస్తారని ఆయన పేర్కొన్నారు. పేదలకు సాయం చేయడం రంజాన్ మాసపు ప్రత్యేకత అని, ప్రతి ఒక్కరు తమ సంపద నుంచి కొంత మేర పేదలకు పంచాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కర్వ మసీదు నిర్వహణ కమిటీ ప్రధాన కార్యదర్శి అజీజ్‌ఖాన్ పఠాన్, మసీదు ఇమామ్ మౌలానా హాఫెజ్ అంజద్ అలీఖాన్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న మతీన్ అలీషాఖాద్రి

పరీక్ష ప్యాడ్‌ల అందజేత

శాలిబండ: శాలిబండలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో రాయల్ పారా మెడికల్ అండ్ ఒకేషనల్ జూనియర్ కళాశాల డైరెక్టర్, న్యాయవాది మహమ్మద్ సాజిద్ అలీ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేశారు. వృత్తి విద్యను అభ్యసించేలా విద్యార్థులను ప్రోత్సాహించడం తమ లక్ష్యమని సాజిద్ అలీ తెలిపారు.